క్లుప్తంగా...

నేడు బీజేపీ మహాధర్నా

లాలాపేట: పేదలకు డబుల్ బెడ్రూమ్‌ల ధోకా ఇచ్చిన కేసీఆర్‌ను నిలదీద్దాం అంటూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం లాలాపేటలో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తార్నాక డివిజన్ అధ్యక్షుడు రాము వర్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. లాలాపేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టనున్న మహాధర్నాకు శ్యామ్‌సుందర్ హాజరవుతారన్నారు.

డిప్యూటీ స్పీకర్‌కు ఆహ్వానం

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలో నిర్వహించనున్న బొడ్రాయి (నాభిశిల) పునః ప్రతిష్ట కార్యక్రమానికి రావాలని ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు గురువారం డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ నెల 21న ఉదయం 8.15 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతోందని కమిటీ అధ్యక్షులు వంజరి ముత్యాలు, మురళియాదవ్, మల్లేష్ యాదవ్, బాలి, సునీల్ ముదిరాజ్ తెలిపారు.

హైటెన్షన్ వైర్లు తొలగించాలంటూ వినతి



లాలాపేట: తార్నాకలో జనావాసాలపై నుంచి ఉన్న 33కేవీ హై టెన్షన్ విద్యుత్ వైర్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని గురువారం ఆ ప్రాంత ప్రజలు డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. స్ట్రీట్ నెంబర్ 10, 11 ప్రాంతంలో పలు ఇళ్లపైన విద్యుత్ వై ర్లు ఉండటంతో తరచుగా విద్యుత్ ప్రమాదాల బారిన పడుతున్నామని డిప్యూటీ మేయర్‌కు వివరించారు. విద్యుదాఘాతంలో పలువురు గాయపడ్డ ఘటనలు, మరణించిన సందర్భాలు ఉన్నాయన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



అమీర్‌పేట: మంత్రి తలసాని చొరవతో చాణక్యనగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభమైనట్లు కొలను బాల్‌రెడ్డి అన్నారు. జలమండలి అధికారులతో కలిసి గురువారం పనులను పరిశీలించి మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా డ్రైనేజీ సమస్య పెండింగ్‌లో ఉండగా కాలనీ వాసులు విజ్ఞప్తి మేరకు మంత్రి నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభించారన్నారు.

హాస్టల్స్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ హాస్టల్స్ వర్క ర్స్ సమస్యల పరిష్కారం కోసం ధర్నా చేపట్టారు. గురువారం క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్ ఎదుట ఐఎఫ్‌టీయూ అనుబంధ ప్రోగ్రెసివ్ కాంట్రాక్టు అండ్ క్యా జువల్ వర్కర్స్ యూనియన్ ఓయూ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాకు యూనియన్ జిల్లా నాయకురాలు ఎస్‌ఎల్ పద్మ హాజరై మాట్లాడారు. హాస్టళ్లలో పని చేస్తున్న 400 మందికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యా న్ని కల్పించి, వర్కర్స్‌ను పర్మనెంట్ చేయాలన్నారు. కాంట్రాక్టులను రద్దు చేసి ఓయూ ద్వారానే ప్రతి నెల 7న వేతనాలు చెల్లించాలని వీసీ ప్రొ.రవీందర్‌కు వినతి పత్రం ఇచ్చారు. లక్ష్మీ, శ్యామల, లలిత, లత, భారతి, భార్గవి, కృష్ణవేణి, విజయ, వీణ, సుజాత, మంగ, ఆండాలు, నాహేద పాల్గొన్నారు.

24న 'కాన్సర్ట్ ఇన్ ది డార్క్' సంగీత కచేరీ



సంగీత కచేరీ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న సినీనటి మంచులక్ష్మి తదితరులు

సనత్‌నగర్: ఈ నెల 24న ఐసీ3 ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో పిల్లల సహాయార్థం నిధులు సేకరించడం కోసం హెచ్ఐసీసీ నోవాటెల్‌లో 'కాన్సర్ట్ ఇన్ ది డార్క్' పేరిట సంగీత కచేరి నిర్వహించనున్నారు. ఈమేరకు బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సినీనటి మంచు లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఎప్పటికప్పుడు ఆత్మస్థైర్యం నింపాలన్నారు. సామాజిక రంగాలవైపు వారిని ప్రోత్సహించాలన్నారు. ఉపాధ్యాయులకు ఉచిత శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఐసీ3 ఇనిస్టిట్యూట్ నిర్వాహకులను ఆమె అభినందించారు. ఐసీ3 ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకులు గణేష్ కోహ్లీ కాన్సర్ట్ ఇన్ ది డార్క్ కార్యక్రమంలో పియానో విద్వాంసులు కలైమామణి, డాక్టర్ అనిల్ శ్రీనివాసన్, బాప్టిస్ట్ నవీన్ నేపియర్, పెర్కషన్ వాద్యకారుడు కృష్ణ కిషోర్, గాయకుడు సాయి విఘ్నేష్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ స్కందబాలి, సిస్టర్ నివేదిత పాఠశాల ప్రిన్సిపాల్ లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

వారంలో మూడ్రోజులు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



అధికారులతో చర్చిస్తున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: అధికారులు వారంలో మూడు రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని బేగంపేట సర్కిల్‌కు చెందిన జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్, ఎలక్ట్రికల్, హార్టికల్చర్, శానిటేషన్ తదితర శాఖలకు చెందిన అధికారులతో అభివృద్ధి పనులపై గురువారం సమీక్ష నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికై రూ.30 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే కోట్లాది రూపాయల వ్యయంతో అనేక అభివృద్ధి పనులు చేపట్టి దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలను పరిష్కరించామన్నారు. క్షేత్రస్థాయి పర్యటనతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎస్ఎన్‌డీపీ కార్యక్రమం కింద బేగంపేట నాలా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, బ్రాహ్మణవాడీలో అన్ని వీధుల్లో డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ల ఏర్పాటుతో పాటు రోడ్ల నిర్మాణ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీలో ముస్లిం గ్రేవ్‌యార్డు నిర్మాణ పనులను కూడా మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు.మ్యాన్‌హోల్ల పొంగిపొర్లకుండా స్పెషల్ డ్రైవ్ చేపట్టి పూర్తిస్థాయిలో పూడిక తొలగించాలన్నారు. ఎక్కడా కూడా ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడవద్దని, సమస్య ఉన్న ప్రాంతాల్లో పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రతిపాదనలు అందజేయాలని ఆదేశించారు. కలుషిత నీటి సరఫరాపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బన్సీలాల్‌పేటలోని డాన్‌బాస్కో స్కూల్ వద్ద గల పార్కు, బేగంపేట ఎయిర్‌లైన్స్‌కాలనీ పార్కుల అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. వర్షాకాలంలో వ్యాధులు అధికంగా వ్యాపించే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నివారణకు ఫాగింగ్ చేయడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ రవి కిరణ్, డీసీ శంకర్, ఎస్ఈ అనిల్, ఈఈ సుదర్శన్, వాటర్‌వర్క్స్ సీజీఎం ప్రభు, జీఎం కృష్ణ, ఎలక్ట్రికల్ డీఈ శ్రీధర్, సుధీర్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ క్రిష్టోఫర్, శానిటేషన్ డీఈ శ్రీనివాస్, హార్టికల్చర్ అధికారి గణేష్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



ధర్నాలో పాల్గొన్న యూనియన్ నాయకులు

రాంగోపాల్‌పేట్: కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ నగర అధ్యక్షులు కుమార స్వామి డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో 3వ రోజు సమ్మెలో భాగంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో కుమారస్వామి పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంట్రాక్టు పద్ధతిలో ఏఎన్ఎంలు గత 20 ఏళ్లుగా పనిచేస్తున్నారని కానీ ప్రభుత్వం వారి రెగ్యులరైజ్ పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుందని విమర్శించారు. ఏఎన్ఎంల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చకపోవడంతో మూడు రోజులుగా సమ్మెలో పాల్గొంటుండగా వైద్య ఆరోగ్యశాఖలో సేవలు నిలిచిపోయినప్పటికీ ప్రభుత్వంలో చలనం రావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కవిత, కిరణ్మయి, రాజేశ్వరి, లక్ష్మి, అమ్మవాజీ, విజయ, ప్రణయ శీల పాల్గొన్నారు.

భిక్షపతికి డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఫిలాసఫీ విభాగం పరిశోధన విద్యార్థి జన్ను భిక్షపతికి పీహెచ్‌డీ డాక్టరేట్ వచ్చింది. విశ్రాంత అధ్యాపకులు ప్రొ.లక్ష్మణ్ పర్యవేక్షణలో 'డా.అంబేడ్కర్ వీవ్స్ ఆన్ ద కాన్సెప్ట్ ఐడిల్' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది.

ఉరేసుకున్న వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: అనారోగ్య కారణంతో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ దయాకర్ వివరాల ప్రకారం. తుకారాంగేట్ వడ్డెరబస్తీకి చెందిన శివ(29) లేబర్ పని చేస్తుంటాడు. కొంత కాలంలో అనారోగ్య సమస్యలు తలెత్తడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి సమయంలో తన గదిలోకి వెళ్లి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి త రలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు పోలీసులు తెలిపారు.

పేద విద్యార్థులను స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలి



విద్యార్థులకు కిట్‌లు అందిస్తున్న అనిల్‌కుమార్

రాంగోపాల్‌పేట్: పేదరికంతో విద్యార్థులు విద్యకు దూరం కాకుండా ఉండేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆదుకోవాలని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ అన్నారు. గురువారం ఐసీఎల్ ఫిన్‌కార్ప్ ఆధ్వర్యంలో 100 మంది అనాథ విద్యార్థులకు 12వ తరగతి వరకు ఉచిత విద్య తదితర ఖర్చులు అందించే స్పాన్సర్ షిప్ కార్యక్రమాన్ని గ్రాండ్ మినార్వా హోటల్‌లో నిర్వహించారు. అలాగే 25 పాఠశాలలకు ఉచిత క్రీడా సామగ్రి, 10వ తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదుతో పాటు జ్ఞాపికలను అందించి సత్కరించారు. అలాగే ఐసీఎల్ ఫిన్‌కార్ప్ 11 కొత్త శాఖలను తెలంగాణాలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ.. ఓ వైపు వ్యాపారంలో వినియోగదారుల విశ్వాసాన్ని చూరగొంటూ వ్యాపారాభివృద్ధితో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు పెద్ద ఎత్తున ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎండీ కేజీ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు అద్దెకు కావాలంటూ రూ. 98 వేలు స్వాహా

అడ్డగుట్ట: ఇల్లు అద్దెకిస్తామంటూ పోస్ట్‌పెట్టిన యజమాని ఖాతా నుంచి ఓ వ్యక్తి నగదు కాజేసిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈస్ట్ మారేడ్‌పల్లికి చెందిన మనోహర్ తన ఇల్లు అద్దెకు ఇస్తానంటూ హౌసింగ్ యాప్‌లో పోస్ట్ పెట్టాడు. ఇది చూసిన ఓ వ్యక్తి బుధవారం మనోహర్‌కు ఫోన్ చేసి తాను మిలిటరీ ఆఫీసర్‌ను అని తనకు ఇల్లు అద్దెకు కావాలని మాయమాటలు చెప్పి ఫేక్ ఐడీ కార్డు చూపించి నమ్మించాడు. గూగుల్ పే ద్వారా అడ్వాన్స్ పంపిస్తానని చెప్పి మనోహర్ గూగుల్ పే ఓపెన్ చేయించి క్యూఆర్ కోడ్ తనకు పంపించమని చెప్పాడు. పంపిన వెంటనే మూడు దఫాలుగా రూ. 98 వేలు మనోహర్ ఖాతాలో నుంచి కట్ అయ్యాయి. మోసపోయినట్లు గ్రహించి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు

ఘనంగా రామేశ్వర్‌గౌడ్ జన్మదిన వేడుకలు



రైస్‌కుక్కర్లు అందజేస్తున్న రామేశ్వర్‌గౌడ్ చిత్రంలో పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ తనయుడు యువజన నాయకుడు తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం సీతాఫల్‌మండిలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్లో జరిగిన వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా పద్మారావుగౌడ్, రామేశ్వర్‌గౌడ్ ఫంక్షన్‌హాల్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం 50 మంది మహిళలకు రైస్ కుక్కర్లు, 10 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జలంధర్‌రెడ్డి, రాజ సుందర్, నీల ప్రభాకర్, సుంకు రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పుట్టిన రోజు వేడుకలు



లాలాపేట: బీజేపీ రాష్ట్ర నాయకురాలు బండా కార్తీకరెడ్డి జన్మదిన వేడుకలను గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. అంతకంటే ముందు మేడిబావి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్టేషనరీ, తార్నాకలోని వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. తార్నాకలోని ఆమె నివాసంలో జరిగిన వేడుకలకు మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామ్‌చందర్‌రావు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, గౌతమ్‌రావు, శ్యామ్‌సుందర్‌గౌడ్, నాగేశ్వర్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు కార్తీకరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బండా చంద్రారెడ్డి, వీరన్న, హరి, శివరెడ్డి, రాజ్‌కుమార్, రాము వర్మ, గోపాల్‌చారి, మణికంఠ పాల్గొన్నారు.

కుమార్తెతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలుశిక్ష



నాగరాజు

చిలకలగూడ: కుమార్తెతో అసభ్యంగా ప్రవర్తించిన తండ్రికి జైలుశిక్ష విధించిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ మట్టంరాజు, ఎస్ఐ బాలరాజు వివరాల ప్రకా రం.. మెట్టుగూడ డివిజన్ దూద్‌బావికి చెందిన మద్దెల నాగరాజు (45) కూలీ పనులు చేస్తుంటాడు. ప్రతిరోజు పూటుగా మద్యం తాగి బస్తీవాసులతో నిత్యం గొడవలు పడుతుంటాడు. ఈ నెల 15వ తేదీన మద్యంమత్తులో కుమార్తెతో అసభ్యంగా ప్రవర్తించడంతో సమాచారం అందుకున్న గస్తీ పోలీసులు నాగరాజుపై పెట్టీ కేసు నమోదు చేశారు. సికింద్రాబాద్ 15వ స్పెషల్ మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ కోర్టులో గురువారం హాజరుపర్చగాన్యాయమూర్తి రమణమూర్తి నాలుగు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.



అమ్మవారి దర్శనం

బల్కంపేట ఎల్లమ్మ–పోచమ్మ అమ్మవార్లను గురువారం బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అర్చక సిబ్బంది వారికి తీర్థప్రసాదాలను అందజేశారు.

–సనత్‌నగర్

మంత్రి కేటీఆర్ పుట్టిన రోజు పురస్కరించుకుని బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ రూబిక్ క్యూబ్స్‌తో రూపొందించిన కేటీఆర్ చిత్రపటాన్ని బహూకరించారు. ఇటీవల కేటీఆర్ జన్మదినం థ్రిల్ సిటీలో నిర్వహించగా రూబిక్స్ క్యూబ్ ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించారు. గురువారం థ్రిల్‌సిటీకి కేటీఆర్ రాగా ఆ చిత్రపటాన్ని తలసాని సాయి కిరణ్ ఆయనకు అందించారు.

–రాంగోపాల్‌పేట్



నూతన పాలక మండలి ప్రమాణస్వీకారం



నూతన పాలక మండలి సభ్యులు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ భోలక్‌పూర్‌లోని మల్లికార్జున స్వామి దేవాలయం నూతన పాలక మండలిని నియమించారు. సభ్యులుగా వెంకట్‌బాబు, శ్రీరాములు, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, నాగలక్ష్మి, సంధ్య, లక్ష్మీను నియమిస్తూ దేవాదాయ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. గురువారం దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆఈవో జ్యోతి, ఇన్‌స్పెక్టర్ అండాలు కలిసి పాలక మండలి సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, మాజీ కార్పొరేటర్ ఏసూరి సావిత్రి, నాయకులు లక్ష్మీపతి, మహేష్, పవన్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

- మల్లికార్జున స్వామి దేవాలయం కమిటీ చైర్మన్‌గా శ్రీరాములు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయం సమగ్రాభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తానని, దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తామన్నారు.

సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలి



మండల కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

అడ్డగుట్ట: సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలని బీజేపీ సికింద్రాబాద్ అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన పథకాలన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మారేడ్‌పల్లి మండల కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల ప్రకటనలతో ప్రజలను మోసం చేస్తూ కాలయాపన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆ పథకాలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళిత, బీసీ, మైనార్టీ బంధు, గృహలక్ష్మి పథకాలను వెంటనే అమలు చేయాలన్నారు. అర్హులైన పేద ప్రజలందరికీ డబుల్ బెడ్రూమ్‌లు ఇస్తామని చెప్పిన కేసీఆర్ మాటల గారడీతోనే కాలం వెల్లదీస్తున్నారని ఆరోపించారు. దళిత బంధు కూడా కేవలం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకే ఇస్తున్నారని, సామాన్య ప్రజలకు ఒక్కరికి కూడా అందడం లేదన్నారు. ఎన్నికల సమయంలోనే కేసీఆర్ సంక్షేమ పథకాలు ప్రకటించడం హాస్యాస్పదం అని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రకటించిన సంక్షేమ పథకాలన్నింటినీ అమలు చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామన్నారు. అనంతరం మారేడ్‌పల్లి మండల కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో ఆదం విజయ్, సారంగపాణి, రవి ప్రసాద్, సతీష్‌గౌడ్, మహేష్‌గౌడ్, మంద సురేష్, శారద, ప్రకాష్‌గౌడ్, హంసరాజు, రాజేష్, శివాజీ, వేణుగోపాల్, కళావతి, ప్రేమలత పాల్గొన్నారు.

అమీర్‌పేటలో..

అమీర్‌పేట: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్రూమ్ ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మహంకాళి సికింద్రాబాద్ బీజేపీ జిల్లా అధ్యక్షులు బూర్గుల శ్యామ్‌సుందర్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం అమీర్‌పేట తాహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూమ్‌లతోపాటు బీసీ, దళిత బంధు పథకాన్ని అమలు చేయాలని లేని పక్షంలో ప్రభుత్వం మరింత ఒత్తిడి తీసుకు వస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ భీమయ్యగౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సరళ, పార్టీ నేతలు పాల్గొన్నారు.

సర్వీసు ఛార్జీలు విడుదల చేయాలి

రక్షణ మంత్రికి కాంగ్రెస్ నేతల లేఖ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీబీ దేవేందర్

కంటోన్మెంట్: కేంద్రం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు ఇవ్వాల్సిన రూ.700 కోట్ల సర్వీసు ఛార్జీలను తక్షణమే విడుదల చేయాలని కాంగ్రెస్ నేత డీబీ దేవేందర్ డిమాండ్ చేశారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు లేఖ రాసిన ఆయన గురువారం పికెట్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బోర్డు మాజీ సభ్యులు తమ స్వలాభం కోసం పనిచేశారు తప్ప సర్వీసు ఛార్జీలు రప్పించడంలో ఏమాత్రం శ్రద్ధ చూపలేదన్నారు. కొందరైతే ఇబ్బడి ముబ్బడిగా అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు కంటోన్మెంట్ వికాస్ మంచ్ ఏర్పాటైందన్నారు. పదేపదే పార్టీలు మార్చే ఒక బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు కాంగ్రెస్ కార్యకర్తలను విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో తనను కాదని, స్థానికేతరులకు కాంగ్రెస్ టికెట్ కేటాయిస్తే స్థానికులకే మద్దతు ఇస్తానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో హరికుమార్, ప్రకాశ్, ఇమామ్, శ్రీను పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు కిట్ల పంపిణీ



కిట్లు అందజేస్తున్న శ్రీగణేశ్

కంటోన్మెంట్: కులవృత్తులపై ఆధారపడి జీవించే వారు ఆర్థికంగా ఎదిగేందుకు తమ ఫౌండేషన్ ద్వారా సహకారం అందజేస్తామని శ్రీగణేశ్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నేత శ్రీగణేశ్ అన్నారు. కంటోన్మెంట్‌లోని సిఖ్‌విలేజ్‌లో గురువారం స్థానిక నాయీ బ్రాహ్మణులతో సమావేశమై 30 మందికి 12 రకాల వస్తువులతో కూడిన కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి నాయీ బ్రాహ్మణ ప్రెసిడెంట్ యాదగిరి, మల్లేష్, సంజీవ, దశరత్, వెంకట్ స్వామి పాల్గొన్నారు.

బస్‌పాస్‌ల అందజేత ..

రసూల్‌పురా: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని శ్రీ గణేష్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ గణేష్ కోరారు. కంటోన్మెంట్ నియోజకవర్గం మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఉచితంగా బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఉపాధ్యాయులు తమ దృష్టికి తీసుకువచ్చారని ఆర్టీసీ అధికారులు, ఉపాధ్యాయులతో సమన్వయమై విద్యార్థులకు బస్ పాస్‌లను తమ ఫౌండేషన్ తరఫున అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆశీర్వాదం, సుప్రద ఐరీన్, ఉపాధ్యాయులు షద్రక్, ఖదీర్, ఆర్టీసీ కంటోన్మెంట్ డీఎం రామ్మోహన్ పాల్గొన్నారు

విద్యతోనే పేదల జీవితాల్లో వెలుగులు



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన డీబీఎఫ్ నాయకులు

పద్మారావునగర్: విద్యాభివృద్ధితోనే పేదల జీవితాల్లో వెలుగులు చూడగలమని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన అన్నారు. హమాల్‌బస్తీ మురికివాడలో గురువారం గృహ కార్మికుల పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ.. మురికివాడల్లోని పేదలు తమ పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలని సూచించారు. విద్యార్థులు బాగా కష్టపడి చదువుకుంటూ ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. పోటీ ప్రపంచంలో బాగా చదువుకున్నప్పుడే అనుకున్న లక్ష్యానికి చేరుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకురాళ్లు సుజాత, శశికళ, జ్యోతి, కవిత, బాను పాల్గొన్నారు.

విధుల్లో అంకితభావంతోనే గుర్తింపు



నాగరాజు, జ్యోతి సన్మాన కార్యక్రమంలో ఏసీపీ శంకర్‌రాజు

సనత్‌నగర్: విధి నిర్వహణలో అంకితభావమే ఉన్నతాధికారుల ప్రశంసలతో పాటు ప్రజాభిమానాన్ని పొందేలా చేస్తోందని బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. బేగంపేట టీటీఐ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి నల్లకుంట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వెళ్లిన జి.నాగరాజు, ఎస్ఐగా పనిచేసి బొల్లారం లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన జ్యోతిలను గురువారం సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శంకర్‌రాజు మాట్లాడుతూ.. ప్రజలకు రక్షణగా నిలిచే పోలీసు వృత్తిలో ఉండడం మనందరి అదృష్టమన్నారు. ప్రజలు నిర్భయంగా ఉంటున్నారంటే 24 గంటల పాటు పోలీసులు విధి నిర్వహణలో ఉండడమేనని, అలాంటి పోలీసు వృత్తికి మరింత వన్నె తెచ్చేలా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలోని 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆర్ కృష్ణయ్య

రాంగోపాల్‌పేట్: కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం సికింద్రాబాద్ ఎంజీరోడ్డులోని జాడే ఆర్కెడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రిచ్ మ్యాక్స్ ఫిన్‌వెస్ట్ గోల్డ్ లోన్ రీజనల్ కార్యాలయం ప్రారంభించిన అనంతరం తెలంగాణాలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 9 శాఖలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వేలోనే 3.5 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని రైల్వేలో సాంకేతిక, సాధారణ సిబ్బంది లేకే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. లక్ష డెబ్బై వేల బ్యాంకు ఉద్యోగాలు, 75 వేల బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులు, 1470 ఐఏఎస్ పోస్టులు ఖాళీ ఉంటే వంద, 970 ఐపీఎస్ పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 70 – 80 మాత్రమే భర్తీ చేస్తున్నారని అన్నారు. ఉద్యోగాల భర్తీలో బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఉద్యోగాలను భర్తీ చేయకుంటే పార్లమెంటు సమావేశాల్లో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా అనాథాశ్రమానికి రూ.50వేల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చీర సుచిత్ర, పారిశ్రామిక వేత్త రవి ఇప్పనపల్లి, డైరెక్టర్ జాలీ, సేల్స్ హెడ్ ప్రవీణ్‌బాబు, జోనల్ మేనేజర్ అలెక్స్ జోసఫ్, ఆర్ఎం ఉపేందర్, తెలంగాణ కోఆర్డినేటర్ సీహెచ్ భద్ర పాల్గొన్నారు.